మార్పు కోసం... మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## సమగ్ర పంటల విధానం ఏదీ !

సంక్రాంతి సందర్భంగా అన్నదాతలను పొగడడం..రైతు ప్రభుత్వమని చెప్పుకోవడం మినహా సంపూర్ణంగా రైతులకు మేలు జరగడం లేదు. ఏటా వారు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్తాయిలో ఆలోచన చేయడం లేదు. కేంద్ర రాష్ట్రాలు ఉమ్మడి కార్యాచరణ అమలు చేయాల్సి ఉంది. పంట వేయడం మొదలు..కొనుగోళ్ల వరకు వారికి సాయంగా ఉండాల్సిన వ్యవసాయ శాఖ నిర్వీర్యంగా మారింది. పంటలు ఏవి వేయాలో..ఏవి వేయరకూడదో తెలియచేస్తూ ముందుకు సాగాల్సి ఉంది. బియ్యం ధరలు అనూహ్యంగా పెరుగుతున్నా..రైతులకు మాత్రం గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంటల కొనుగోళ్లు అనేవి ఏటా ఓ ప్రహసనంగా మారుతున్నాయి. పంటలను సకాలంలో కొనుగోలు చేసి వారికి డబ్బులు చెల్లించే పక్కా ఏర్పాట్లు జరగడం లేదు. కేంద్రం ఈ-నామ్ ప్రవేశ పెట్టినా రైతుల కష్టాలు తీరడం లేదు. పంటలకు జాతీయస్థాయిలో ధరలు వస్తాయని, కొనుగోళ్లు జరుగుతాయని అంతా భావించారు. మోడీ ఇచ్చిన హామీలు ఏవీ అమలు జరగడం లేదు.దీంతో ఏటా పంట ఉత్పత్తులు అమ్ముకోవడంలో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు ఏవైనా ఈ నామ్ కింద వ్యాపారులు తీసు కోవడం లేదు. మొన్నటికి మొన్న ఖమ్మంలో మిర్చి అమ్ముకోవడానికి రైతులు నానాయాతన పడ్డారు. ఏటా ఈ ప్రహసనం జరుగుతున్నా కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. మార్కెట్లలో కూడా పక్కాగా నిబంధనలు అమలు జరగడం లేదు. తెలంగాణలో గోదాముల సంఖ్య పెరిగి నా అందుకు తగ్గట్లుగా మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు పెరగడం లేదు. ఈ పరిస్థితి తెలుగు రాష్ట్రాలకు సంబంధించి నదే కాదు..దేశ వ్యాప్తంగా ఇదే తీరుగా ఉంది. జిల్లాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ఒక ప్రహసనంగా మారింది. అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి నెలకొన్న పరిస్థితులకు పొంతన ఉంటడం లేదు. మిల్లర్లే నేరుగా కొనుగోలు చేస్తున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. రైతు భరోసాకేంద్రాలకు వచ్చిన రైతులను కూడా మిల్లర్ల వద్దకు పంపుతుండగా వారు తేమశాతంపై మరోసారి పరీక్ష చేస్తున్నారు. మరో వైపు ప్రభుత్వ లక్ష్యం చాలా తక్కువగా ఉండటం వల్ల జిల్లాలో పండిన ధాన్యంలో దాదాపు 75 శాతం మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. రబీ పంటలు సాగు పూర్తయిన తరువాత కుప్పలను నూర్పిడి చేసి విక్రయించుకునేలా సిద్ధం అవుతున్నారు. ప్రధానంగా మద్దతు ధరలు దకకడం లేదు. అలాగే తేమశాతం పేరుతో తరుగు దోపిడీ సాగుతోంది. దడవాయి కూడా తప్పడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి, ప్రభుత్వం ఆంక్షలు, రవాణా ఛార్జీలు,నిల్వ చేసుకునే అవకాశం లేని వారు పొలాల్లోనే విక్రయిస్తున్నారు. ప్రధానంగా వ్యాపారులు బిపిటి ధాన్యం కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు కూడా భారీగా పెరగడంతో తెలంగాణ వ్యాపారులు జిల్లాకుపెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిసింది. జిల్లాకు చెందిన మిల్లర్లు తేమశాతం నిబంధనతో ఆంక్షలుపెట్టడం వల్ల రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. దీంతో రైతులు మిల్లర్లు, వ్యాపారులకు పొలాల్లోనే విక్రయించుకుంటున్నారు. డెల్టా ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు పొలాల్లో కుప్పలు వేసి రెండో పంట వేశారు. మంచి ధర వచ్చినప్పుడు విక్రయించు కోవాలన్న లక్ష్యంతో వరిని కోసి కుప్పలు వేసి రబీ సాగు వైపు మొగ్గుచూపారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల ఆధిపత్యం తగ్గించాలని, ఆర్‌బికే సిబ్బంది బాధ్యత తీసుకుని ఖచ్చితంగా కొనుగోలు చేస్తారని నిర్ధారణ అయిన తరువాతనే మిల్లర్ వద్దకు పంపాలని కోరారు. మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన పైర్లకు సంబంధించి రైతులకు వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఇకపోతే తెలంగాణలో పలు జిల్లాల్లో కంది

రైతులకు వారు పండించిన కందులను మార్కెట్‌లో అమ్మడం ఇప్పుడు ఒక పరీక్షలా మారింది.మరోవైపు మద్దతు ధరలు పలకడం లేదు. మద్దతు ధర అందక ప్రైవేట్ వ్యాపారులకు కందులను తెగనమ్మకుంటు న్నారు. మిర్చి, పత్తిరైతుల పరిస్తితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం మార్పులు కానరావడం లేదు. మార్కెట్లో అమ్మకానికి సిద్దంగా ఉన్న నిల్వలు అమ్ముకోలేక అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మిర్చి,పత్తి రైతులు కూడా ఇదే రకమైన ఆందోళనలో ఉన్నారు. ఓ వైపు ధరలు లేక మరోవైపు కొనుగోళ్లు సాగక ఆందోళనగా చూస్తున్నారు. సంక్రాంతి వేళ ఆనందంగా ఉండాల్సిన అన్నదాతలు కొనుగోళ్లు లేక మరికొన్నిచోట్ల తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవడం తలకుమించిన భారం అవుతోంది. దీనికితోడు గన్నీబ్యాగుల కొరత వారిని వేధిస్తోంది. ఇకపోతే నిల్వ చేయడానికి సరిపడా గోదాంలు లేవన్న ఆరోపణలు ఉన్నాయి. రైతులకు వ్యవసాయ మార్కెట్‌లో తిప్పలు తప్పడంలేదు. ఇప్పటికైనా ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. 'ఈ-నామ్' విధానం పటిష్టపరచి జాతీయ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి స్పష్టమైన ప్రణాళిక అమలు చేయాల్సి ఉంది. ఉన్నతాధి కారులు ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకొని ఇబ్బంది లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. మిరప, పసుపు పంటలకు ప్రభుత్వం మద్దతు ధరలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనలో రైతులకు న్యాయం జరగగడం లేదు. మొత్తంగా సమస్యలను వదిలి పాలకులు తమ సొంత విధానాలను రుద్దతున్నారు. అలా కాకుండా క్షేత్రస్థాయి అవగాహనతో రైతు సంక్షేమకార్యక్రమాలు

## ఉట్నూరులో ఇంటర్ లీగ్ పోటీలు

**ఆదిలాబాద్,జనవరి17(మరోఉదయం):**

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో బుధవారం ఇంటర్ లీగ్ సొసైటీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గిరిజన, సాంఘీక, బీసీ,జనరల్, మైనారిటీ సొసైటీలకు చెందిన 5వేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్ లు ప్రారంభించారు. ఈ క్రీడోత్సవానికి గిరిజన సంక్షేమ కార్యదర్శి వెంకట్ నర్సింహారెడ్డి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్ పై, సాంఘీక సంక్షేమ శాఖ కార్యదర్శి నవీన్ నికోలాస్ హాజరైయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టకున్నాయి.

## ఎమ్మెల్సీ నామినేషన్లకు నేడే చివరి రోజు

- రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్
- అద్దంకి దయాకర్ బదులు మహేశ్ కుమార్ గౌడ్
- పిన్న వయసులో బల్మూరి వెంకట్‌కు అవకాశం

**హైదరాబాద్,జనవరి17(మరోఉదయం):**

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లకు గురువారంతో గడువు ముగియనుంది.రెండు స్థానాలకు విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల కావడంతో రెండు పదవులకు విడివిడిగా ఎన్నికల ప్రక్రియ జరుగనుంది. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్‌కు మాత్రమే ఎమ్మెల్సీ పదవులను గెల్చుకునే అవకాశం ఉంది. రెండు పోస్టులకు కాంగ్రెస్ అధిష్టానం తమ అభ్యర్థులను అదికారికంగా ప్రకటించింది, కాంగ్రెస్ పార్టీ మార్క్ ట్విస్టులు ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా ఖరారులో కనిపించాయి. ఎమ్మెల్యే కోటాలో రెండు స్థానాలకు అద్దంకి దయాకర్, బలమూరి వెంకట్ పేర్లను ఖరారు చేసినట్లుగా మంగళవారం వారికి ఏఐసీసీ నుంచి సమాచారం వచ్చింది. అయితే బుధవారం విడుదలయిన జాబితాలో మాత్రం బలమూరి వెంకట్ తో పాటు మహేష్ కుమార్ గౌడ్ పేరు ఉంది. దీంతో అద్దంకి దయాకర్‌కు షాక్ తగిలినట్లయింది. అద్దంకి దయాకర్ కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లేదా వరంగల్ ఎంపీ టిక్కెట్ ఇస్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బల్మూరి వెంకట్, మహేష్ కుమార్ గౌడ్ పేర్లను ఖరారు చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం ప్రకటన విడుదల చేసింది. గురువారంతో ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లకు గడువు ముగియనుండగా.. బుధవారం అభ్యర్థులను ప్రకటించింది. అయితే, చివరి వరకు కూడా అద్దంకి దయాకర్‌కే ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఖరారు అని ప్రచారం జరుగగా.. తాజాగా సీన్ రివర్స్ అయ్యింది. అంతేకాదు.. మంగళవారం నాడు పార్టీ పెద్దలు సైతం అద్దంకి దయాకర్‌కు ఫోన్ చేసి నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారని ప్రచారం సాగింది. దీంతో ఆయన అనుచరులు సంబరాలు చేసుకున్నారు. దయాకర్ కూడా ఆనందం వ్యక్తం చేశారు. కానీ, ఈ సంబరాలు, అనందం గంటల్లో ఆవిరయ్యాయి. కాంగ్రెస్ ప్రకటించిన జాబితాలో దయాకర్ పేరు మిస్ అయ్యి.. మహేష్ కుమార్ గౌడ్ పేరు తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. నామినేషన్ల గడువు గురువారంతో ముగియనుండగా.. 29న రెండు స్థానాలకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ నిర్వహించి.. ఫలితాలను ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరు మాత్రమే నామినేషన్ వేస్తే..ఏకగ్రీవం అయ్యే ఛాన్స్ ఉంది.

## మేడిగడ్డ కుంగుబాటుపై విచారణ

### రంగంలోకి దిగిన డీజీ రాజీవ్ రతన్

**జయశంకర్ భూపాలపల్లి,జనవరి17(మరోఉదయం):**

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణ చేపట్టేందుకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్ రతన్ రంగంలోకి దిగారు. బుధవారం ఆయన ఎస్పీ శ్రీనివాసులుతో కలిసి కాళేశ్వరం హరిత హోటల్‌లో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మేడిగడ్డతోపాటు కన్నెపల్లి పంప్ హౌస్ మునకకు కారణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీని విజిలెన్స్ ఆఫీసర్లు పరిశీలిస్తున్నారు. వారంతా రెండ్రోజులపాటు విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## దావోస్‌లో పెట్టుబడల వేటలో సీఎం రేవంత్

కొత్త డ్రగ్స్, డివైజ్‌లను కనుగొనేందుకు, అభివృద్ధి చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా 1,000 మందికి పైగా ఆవిష్కర్తలకు హైదరాబాద్ సేవలందిస్తోంది. కొత్త ఔషధాల సృష్టి, అభివృద్ధి, తయారీ సేవల విభాగంలో ఆరాజెన్ కంపెనీకి 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నది. ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ రంగాలకు కాంట్రాక్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సేవలను ఈ కంపెనీ అందిస్తోంది. రాబోయే అయిదేండ్లలో తమ సేవలను విస్తరించే ప్రణాళికను ప్రకటించటం సంతోషంగా ఉందని కంపెనీ సీఈవో మణి కంటిపూడి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్త ఔషధ ఆవిష్కరణలు, పరిశోధన సంస్థల కేంద్రంగా హైదరాబాద్ జాతీయ స్థాయిలో తనకున్న హోదాను నిలబెట్టుకుంటుందనే విశ్వాసం కలుగుతోందన్నారు. తమ కంపెనీ విస్తరణకు తగినంత మద్దతు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ విస్తరణతో హైదరాబాద్ దేశంలోనే కాంట్రాక్ట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ హబ్ గా మారనుంది. కొత్త డ్రగ్స్, డివైజ్‌లను కనుగొనేందుకు, అభివృద్ధి చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా 1,000 మందికి పైగా ఆవిష్కర్తలకు హైదరాబాద్ సేవలందిస్తోంది. కొత్త ఔషదాల సృష్టి, అభివృద్ధి, తయారీ సేవల విభాగంలో ఆరాజెన్ కంపెనీకి 20 ఏళ్లకుపైగా అనుభవముంది. ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ రంగాలకు కాంట్రాక్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్?మెంట్ సేవలను ఈ కంపెనీ అందిస్తోంది.

## హిట్ అండ్ రన్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

**ఆదిలాబాద్,జనవరి17(మరోఉదయం):**

కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా ఆదిలాబాద్‌లో లారీ డ్రైవర్లు, క్లీనర్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ చట్టం వల్ల నిరుపేద డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతారని ఆ సంఘం నాయకులు తెలిపారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు.


## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమా..

**హైదరాబాద్ జనవరి 17 (మరోఉదయం):**



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో మళ్లీ పంటలు పండించనున్నా రని తెలిసింది.ఇందుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ఆయన స్వయంగా ఓ ఫర్టిలైజర్ షాపు యజమా నికి ఫోన్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం ట్విట్టర్ లో వైరల్ గా మారింది.ఇటీవల తుంటి ఎముక విరగడంతో ఆసుపత్రిపాలైన కేసీఆర్ కు వైద్యులు ఆపరేషన్ చేసిన అనంతరం జూబ్లీహిల్స్ లోని నందినగర్ లో ఉన్న సొంతింట్లో ఆయన విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన పూర్తిగా కోలుకున్నట్లు తెలుస్తోంది.మరో వారం పది రోజుల్లో ఎర్రవల్లి ఫాంహౌస్ కు వస్తానని ఆయనే స్వయం గా ఈ ఫోన్ కాల్ లో చెప్పారు.సిద్దిపేట జిల్లా ములుగు మండలం ఒంటిమామిడిలోని ఓ ఫర్టిలైజర్ షాపు యజమానికి మాజీ సీఎం కేసీఆర్ ఫోన్ చేసి, ఈసారి ఫాంహౌస్ లో బొప్పాయి, పుచ్చకాయ, ఇతరత్రా పంటలు సాగు చేద్దామని అనుకున్నట్లు చెప్పారు.వ్యవసాయ పనులన్నీ తానే దగ్గరుండి చూసుకుంటానని వివరించారు. అవసరమైన విత్తనాలు, ఎరువులను రెండు మూడు రోజుల్లో ఫాంహౌస్ కు పంపించాలని ఆ ఫర్టిలైజర్ షాపు యజమానికి సూచించారు.చివరగా మీ ఆరోగ్యం ఎలా ఉంది సార్.. అని అడగగా ఇప్పుడు అంతా బాగుందని, కోలుకున్నానని, త్వరలో ఫాంహౌజ్ కి రాబోతున్నట్లు కేసీఆర్ బదులిచ్చారు.సోషల్ మీడియాలో ఈ వీడియో చూసిన నెటిజన్లు లోక్ సభ ఎన్నికల పరిస్థితి ఏంటీ సార్, రాజకీయ సన్యాసం తీసుకుంటు న్నారా ? అంటూ పలు రకాల కామెంట్లు చేస్తున్నారు.

## రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్





### అటుసినిమా రంగం..ఇటు రాజకీయరంగం అన్నగా ప్రజల గుండెల్లో చిరస్థానం

**విజయవాడ,జనవరి17 (మరోఉదయం):**

తెలుగు రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన మహానటుడు, ఆధునిక సామాజికవేత్త నందమూరి తారకరాముడు. రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నాయకుడిగా చరిత్ర కెక్కారు. ఆయన రాజకీయాల్లోకి రాకముందు స్తబ్దుగా ఉన్న రాజకీయరంగంలో కొత్త తరం ఉద్భవించింది. కొత్తవారు రాజకీయంగా పైకి వచ్చారు. ఎందరినో మంత్రులను, ఎంపిలను చేసిన గనత నాటి సిఎంగా ఎన్టీఆర్‌కు దక్కింది. అణగారిన కులాలను, వర్గాలను అక్కున చేర్చుకుని వారికి రాజకీయంగా పదవులను కట్టబెట్టారు. 1996 జనవరి జనవరి18న ఎన్టీఆర్ మహాభినిష్క్రమణ చేసి అప్పుడే ఇరవై ఎనమిదేళ్లు దాటింది. అయినా నేటికీ ఆయన జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచపోయారు. ఉమ్మడి ఎపిలో ఆయన తెలుగుదేశం పార్టీని పెట్టి, 9నెలల స్వల్పకాలంలోనే కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్లతో పెకిలించారు. ఆనాటి రాజకీయాల్లో ఆయన చరిత్ర సృష్టించారు. అన్నగా జనం గుండెల్లో నిలిచారు. ఇక చిత్రసీమలోనూ ఎందరికో చేయూతనిచ్చి ఆదుకున్నారు. అందుకే ఈ నాటికీ రామారావు జనం మదిలో అన్నగా కొలువై ఉన్నారు. తెలుగు చిత్రపరిశ్రమకు 'పెద్దాయన'గా నిలచిన నటరత్న యన్టీఆర్ నా అనుకున్నవారిని ఆదుకున్న తీరును ఈనాటికీ సినీజనం తలచుకుంటూ ఉన్నారు. అలా ఆయన అభిమానంతో వెలుగులు విరజిమ్మిన వారెందరో. తెరపై అనేక మార్లు శ్రీకృష్ణ పరమాత్మగా నటించి అలరించారు రామారావు. ఆపదలో ఉన్న భక్తులను ఆదుకొనే కన్నయ్యగా నటించడమే కాదు, నిజజీవితంలోనూ యన్టీఆర్ అదే తీరున సాగడం విశేషం. యన్టీఆర్ ఓ సారి నమ్మితే వారి కోసం ప్రాణమిస్తారని ప్రతీతి. యన్టీఆర్ విజయవాడలో చదువుకొనే రోజుల్లో నాటకాలు వేశారు. తాను సినిమా రంగంలో అడుగుపెట్టగానే, తన తమ్ముడు త్రివిక్రమ రావును, పుండరీ కాక్షయ్యను మదరాసు పిలిపించుకొని వారిద్దరినీ భాగస్వాములుగా చేసి ఎన్.ఏ.టి. సంస్థపై చిత్రాలను నిర్మించారు... ఆ తరువాత పుండరీకాక్షయ్యను సోలో ప్రొడ్యూసర్ గానూ చేశారు. రామారావుతో పుండరీకాక్షయ్య 'శ్రీకృష్ణావతారం, భలేతమ్ముడు, ఆరాధన' వంటి అనేక విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. అలాగే తనతో ఎన్నో చిత్రాల్లో నటించిన సత్యనారాయణకూ 'గజదొంగ'కు కాల్ షీట్స్ ఇచ్చారు. ఆ సినిమా ఎంత పెద్ద హిట్టో చెప్పక్కర్లేదు... ఇక యన్టీఆర్ తో 'సంసారం, దాసి' చిత్రాల్లో నాయికగా నటించిన లక్ష్మీరాజ్యం అడగ్గానే 'నర్తనశాల'లో అర్జున, బృహన్నల పాత్రల్లో అభినయించి అలరించిన తీరును ఎవరు మాత్రం మరచి పోగలరు? తరువాతి రోజుల్లో ఆమె నిర్మించిన 'మగాడు'లోనూ యన్టీఆర్ నటించారు. అలాగే తనతో పలు చిత్రాల్లో నటించిన భానుమతి సొంత చిత్రాల్లో నటించారు రామారావు. యన్టీఆర్ 'తాతమ్మకల'లో నటించినందుకు భానుమతి కోరగానే ఆమెకు కాల్ షీట్స్ ఇచ్చారు... యన్టీఆర్ వంటి సూపర్ స్టార్ కాల్ షీట్స్ ఇచ్చినా 'అమ్మాయి పెళ్ళి' అనే సాధారణ చిత్రం తీశారు భానుమతి. తన 'పల్లెటూరు'తోనే నాయికగా పరిచయమైన సావిత్రి దర్శకత్వం వహించిన 'మాతృదేవత'లో నటించి, ఆమెను డైరెక్టర్ గా ప్రోత్సహించారు. ఎన్టీఆర్ ఇటు రాజకీయ, చిత్రరంగాల్లో తనదైన ముద్ర వేయడమే గాకుండా చరిత్ర సృష్టించిన మహనీయుడు. తెలుగు రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన నాయకుడు ఎన్టీఆర్.



WED - M U_SAT - M U.qxd 17-01-2024 08:06 PM Page 3



# భరోసా ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

భద్రాద్రి జిల్లా బ్యూరో జనవరి : 17 మరో ఉదయం

అశ్వాపురం మండలం అనుషక్తి గ్రామానికి చెందిన కండె. సుజాత గత కొద్దీ రోజులు గా గుండె కు సంబందించిన వ్యాధి తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని బుధవారం ఆమెకు అశ్వాపురం భరోసా ఆధ్వర్యంలో 4000 రూపాయలు చెక్కు ను వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. భరోసా సభ్యులు బాజీ మాట్లాడుతూ భరోసా ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితి లో బాధితులకు బ్లడ్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. భరోసా కు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరు నా ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో డాక్టర్. అర్జున్. షఫీ ఖాన్, ఖదీర్, వెంకట్ మస్తాన్, బడే మియా, అన్సారీ, నాగులమిరా, బాజీ తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి బోరుకు మరమత్తులు.

భద్రాద్రి జిల్లా బ్యూరో జనవరి : 17 మరోఉదయం

అశ్వాపురం: గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో వున్న త్రాగునీటి బోరు మరమ్మతులకు గురి కావడంతో స్థానిక ప్రజలు గ్రామ సర్పంచ్ బానోత్ శారద దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సర్పంచ్ బుధవారం మోటార్ ను బిగించి నీటి సమస్యను పరిష్కారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోరు తక్కువ కాలం వ్యవధిలోనే రెండు సార్లు మరమ్మత్తులకు గురైందని తెలిపారు. మళ్ళీ పాడయినందున గ్రామస్థుల కోరిక మేరకు రిపేర్ చేయించడం జరిగిందన్నారు. గ్రామాభివృద్దే తమ ధ్యేయమని గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్నా తమ దృష్టికి వచ్చిన వాటిని తమ బాధ్యతగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు. అపరిశుభ్రత వున్న ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ ను చల్లిస్తున్నామని, అంతే కాకుండా శుభ్రత పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఇసంపల్లి కృష్ణ, గద్దల రామకృష్ణ, ఇసంపల్లి సురేష్, గొల్లపల్లి నరేష్, గ్రామపంచాయతీ సిబ్బంది నలగట్ల ప్రశాంత్, రావులపల్లి నాగరాజు, పెంటయ్య, వెంకన్న పాల్గొన్నారు.



# ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టండి...

## మాధవరం కాంతారావు

మరోఉదయం ప్రతినిధి కూకట్పల్లి



అయోధ్యలో ఈనెల 22న రామ మందిర ప్రారంభోత్సవానికి ముందు భారతదేశంలోని అన్ని దేవాలయాల ప్రాంగణాల్లో పరిశుభ్రత (స్వఛభారత్) కార్యక్రమాన్ని చేపట్టాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కూకట్పల్లి స్వఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో పలు దేవాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా జనవరి 18న కూకట్పల్లి అసెంబ్లీ పరిధిలోని కేపిహెచ్బి రోడ్ నెంబర్-3 శివాలయ ప్రాంగణాలను పరిశుభ్రరిచే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మురళీధర్ రావు విచ్చేయనున్నారని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హిందూ బంధువులు, మోది అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కాంతారావు పిలుపునిచ్చారు.

# నిజాంపేట్ చౌరస్తా వద్ద ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు

మరోఉదయం ప్రతినిధి కూకట్పల్లి

కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని నిజాంపేట్ చౌరస్తా వద్ద గల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద బుధవారం శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త పి ఎస్ ఆర్ కె భగవాన్ ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పిఎస్ఆర్కే భగవాన్ పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, రఘు చక్రవర్తి, దుర్గాప్రసాద్, రవీంద్ర, చిక్కం ఆదినారాయణమూర్తి, బాబు, రాంబాబు, టాటావర్తి సుధాకర్ నాయుడు, ధర్మారావు, చిక్కం గంగరావు, వెంకటరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య...

- బిఆర్ఎస్ కార్యకర్త ఈ దారుణానికి పాల్పడడం విచారకరం...
- ఓయూ జేఏసీ నేత దరువు అంజన్న

మరోఉదయం న్యూస్, శేర్లింగంపల్లి

తెలంగాణ తొలి దశ ఉద్యమ నేత, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని, బిఆర్ఎస్ కార్యకర్త ఈ దారుణానికి ఒడిగట్టడం మరి విడ్డూరంగా ఉందని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నేత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దరువు అంజన్న పేర్కొన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ వద్ద ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని మంగళవారం గోవింద్ అనే వ్యక్తి ధ్వంసం చేసిన విషయాన్ని తెలుసుకొని బుధవారం స్థానిక నాయకులు, జేఏసీ నేతలతో కలిసి దరువు అంజన్న సంఘటన స్థలానికి చేరుకొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాతిపితగా పిలవబడే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలం నుండి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా కొనసాగుతున్న గోవింద్ కన్నం రెడ్డి అనే వ్యక్తి మద్యంమత్తులో బండరాయితో విగ్రహాన్ని ధ్వంసం చేయగా ఈ సంఘటనకు సంబంధించి స్థానిక కార్పొరేటర్, బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురద జల్లడం ఎంతవరకు సమంజసమన్నారు. స్థానికంగా జరిగిన ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ ప్రొఫెసర్ జయశంకర్ నూతన విగ్రహాన్ని వారం రోజుల్లో ఇదే చోట ఏర్పాటుచేసి ఆవిష్కరిస్తామని ఈ సందర్భంగా దరువు అంజన్న తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆర్కే దయాసాగర్, సిహెచ్ సంజీవరావు, బీసీ నేత తేళ్ళ హరికృష్ణ, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మారెళ్ళ శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పట్వారి శేషు వెంకటేష్ నారాయణ రఫీక్ గూడ కిష్టారెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జోనల్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు...

మరోఉదయం న్యూస్ కూకట్పల్లి

కూకట్ పల్లి జోనల్ కమిషనర్ గా నూతనంగా భాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్ ఐ.ఏ.ఎస్ ను కాంగ్రెస్ పార్టీ కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు షేరి సతీష్ రెడ్డి లు బుధవారం జోనల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేచేయారు. ఈ సందర్భంగా బండి రమేష్ కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు సమస్యలను జోనల్ కమిషనర్ కు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



# ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

## వివరాలు సేకరించి సమస్యలు అధ్యయనం చేస్తాం

## అన్ని అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తం

## ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి

హైదరాబాద్,జనవరి17(మరోఉదయం):

ధరణి కారణంగా భూసమస్యలు పెరిగాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని కిసాన్ కాంగ్రెస్ కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణిపై ఏర్పాటైన కమిటీ సభ్యుడు కోదండరెడ్డి చెప్పారు. సచివాలయంలో ధరణి పోర్టల్, రైతులకు కలుగుతున్న ఇబ్బందులపై కమిటీ రెండో సమావేశం జరిగింది. ప్రధానంగా గ్రామాల్లోని సామాన్య రైతులు ధరణి విషయంలో పడుతున్న ఇబ్బందుల పరిష్కారం చూపడంపై కమిటీ దృష్టి సారించిందని కోదండ రెడ్డి చెప్పారు. ఎంతకూ తెగని భూముల పంచాయితీ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపైనా త్వరలోనే కమిటీ ప్రభుత్వానికి పలు సూచనలు చేయనుందన్నారు. ధరణి సాఫ్ట్ వేర్ ఏమిటి.. ధరణిలో ఇప్పటి వరకు జరిగిన మార్పులు, చేర్పులపైనా కమిటీ సమగ్రంగా వివరాలు తెప్పించుకొని ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందన్నారు. భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉండేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి పరిష్కార మార్గాలు కనుగొంటామని అన్నారు. ధరణి పేరుతో రైతులకు అనేక సమస్యలు తెచ్చిపెట్టిందని కోదండరెడ్డి ఆరోపించారు. ధరణి సమస్యలపై కమిటీ మెంబర్లు.. అధికారులకు సమాచారం అడిగారు. ఇందుకుగానూ వారు సీసీఎల్ఏపవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ధరణితో వచ్చిన భూ సమస్యల పరిష్కారం బుధవారం నుంచే ప్రారంభమైనట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సీసీఎల్ఏ కార్యాలయంలో రాబోయే సమావేశాలు ఉంటాయన్నారు. కోదండ రెడ్డి మాట్లాడుతూ.. 'ధరణిలో సమస్యలు గుర్తించే పని మొదలైంది. ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ వస్తాం. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా మా కమిటీ పని చేస్తుంది. వచ్చే సోమవారం సీసీఎల్ఏ భేటీ తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తాం. పోర్టల్లో 35 సమస్యలున్నట్లు గుర్తించాం. ధరణి స్థానంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం పెట్టిన ప్రపోజల్పై అధ్యయనం చేయాల్సి ఉంది' అని అన్నారు.సోమవారం రోజున కమిటీ మూడో సమావేశం సీసీఎల్ ఏ ఆఫీసులో జరుగుతుందని, ఆ రోజు తాము తీసుకోబోయే చర్యలపై వెల్లడిస్తామని కోదండరెడ్డి తెలిపారు. సమావేశంలో ధరణి కమిటీ కన్వీనర్గా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ , మాజీ ఐఏఎస్ రేమండ్ పీటర్, భూ చట్టాల నిపుణుడు సునీల్, విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వడ్డేపల్లి ...

## ఫతేనగర్ లో గోశాలను ప్రారంభించిన రాజేశ్వరరావు

మరోఉదయం న్యూస్, కూకట్పల్లి



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు బిజెపి ఆధ్వర్యంలో గతంలో కూకట్పల్లి నియోజకవర్గం లో చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన సొంత నిధులతో ఫతేనగర్ డివిజన్ లోని దిన్ దయాళ్ నగర్ లో గల పంచముఖి హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన గోశాలను బుధవారం రాజేశ్వర్ రావు ప్రారంభించారు. గతంలో ఫతే నగర్ డివిజన్ లో బీజేపీ భరోసా యాత్ర నిర్వహిస్తున్న సమయంలో దిన్ దయాళ్ నగర్ కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావుని గోశాల నిర్మాణానికి తనవంతు సహకారం అందించాలని కోరారు. గోశాల నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని పూర్తిగా తానే అందిస్తానని తెలిపి ఇచ్చిన మాట ప్రకారం నిర్మాణం పూర్తి చేశారు. బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో గోశాలను ప్రారంభించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వర్ రావు మాట్లాడుతూ కూకట్పల్లి నియోజకవర్గం ప్రజలకు సుపరిచితుడైన తన తండ్రి వడ్డేపల్లి నర్సింగ్ రావు జ్ఞాపకార్థం ఈ గోశాలను నిర్మించినట్లు తెలిపారు. గోమాతకు సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ప్రతి ఒక్కరూ గోమాతను పూజించాలని సకల దేవతల స్వరూపమైన గోమాతను ప్రతి ఒక్కరూ రక్షించాలని పేర్కొన్నారు. అనంతరం అన్నదానంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆలయ కమిటీ నిర్వాహకులు సాయిలు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కుమార్ గౌడ్, అశోక్ కుమార్, భవానీ నగేష్, విజయ్ భాస్కర్ రెడ్డి, మీనా, మల్లేశ్ యాదవ్, మల్లేశ్, దుర్గయ్య, రాజేశ్ రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్, రాజేందర్ రెడ్డి, శివ యాదవ్, సంపత్ యాదవ్, మహేశ్ యాదవ్, మురళి యాదవ్, మాణిక్యం యాదవ్, పవన్ యాదవ్, హేమంత్, ప్రభు యాదవ్, సాయిరాం, లక్ష్మణ రెడ్డి, యాదగిరి, సంజీవ్, దుర్గ ప్రసాద్, కృష్ణా రెడ్డి, దేవా, బీజేపీ నాయకులు కంచి మహేందర్, ఉదయ్ కుమార్, రామ్మోహన్, సతీష్, యాదగిరి, తులసి రామ్, మనోజ్, అరవింద్, గిరి తదితరులు పాల్గొన్నారు.



# కెపిహెచ్బి లో ఘనంగా బీఆర్ఎస్ నేత పవన్ కుమార్ జన్మదిన వేడుకలు...

మరోఉదయం న్యూస్, కూకట్పల్లి



కూకట్పల్లి నియోజకవర్గ%శీ% కెపిహెచ్బి కాలనీకి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పవన్ కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కెపిహెచ్బి కాలనీలో జరిగిన జన్మదిన వేడుకలకు కూకట్పల్లి నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రంగమోహన్, పులి మురళి, పాతూరు గోపి సత్య ప్రకాష్ ప్రభాకర్ రాజేష్, శరత్ కుమార్ ,మండవ శ్యామ్, మోజేష్, అనిల్,ఉన్నం శీను, లక్ష్మణ్, పిడికిటి గోపాల్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన లేదు

## మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ వెల్లడి

రాజన్న సిరిసిల్ల,జనవరి17(మరోఉదయం):

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్ పార్టీకి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేయకుంటే ప్రజలే ప్రభుత్వాన్ని కూల్చుతారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వం కూలబోతుంది అని హెచ్చరిక చేయడం, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి పని చేద్దాం అని మాట్లాడడం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రంలో బుధవారం మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్ కు లేదని స్పష్టం చేశారు. 39 మంది ఎమ్మెల్యేలు, శాసనమండలిలో మెజారిటీ సభ్యులతో బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోందని చెప్పారు. అనవసరంగా బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలు సరికాదని..బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లు ప్రజల ఆశీర్వాదంతో ఎన్నో గొప్ప పనులు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పోరాటం తప్పకుండా చేస్తోందన్నారు.

# కుక్కలదాడిలో జాతీయ పక్షి నెమలి మృత్యువాత

యాదాద్రి భువనగిరి,జనవరి17(మరోఉదయం):

కుక్కలదాడిలో జాతీయ పక్షి నెమలి మృత్యువాత పడింది. ఈ సంఘటన యాదగిరిగుట్ట ఆలయం కొండ కింద గల బస్ స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుధవారం ఉదయం బస్ స్టేషన్ పరిసరాల్లో నెమలి సంచరిస్తున్న సమయంలో ఈఘటన జరిగింది. స్థానికుడు గుజ్జ భాస్కర్ ఫారెస్ట్ అధికారులు సమాచారం ఇచ్చి నెమలిని అప్పగించారు. నెమలికి పంచనామా జరిపి ఖననం చేస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. కాగా, కొండ కింద ఆలయం, నూతన బస్ స్టాప్ వద్ద ఆహారం కోసం నెమలి కిందికి వచ్చినట్లు తెలుస్తున్నది. గాయపడిన నెమలిని చూసి స్థానికులు గుర్తించే లోగా మృత్యువాత పడింది.

# డబ్బు రాజకీయం జోగురామన్నదే

## డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి విమర్శ

ఆదిలాబాద్,జనవరి17(మరోఉదయం):

అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజా సేవా భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డబ్బు కోసమే పార్టీ మారినట్లు మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న చేసిన వ్యాఖ్యలను ఖండించారు. డబ్బు కోసం రాజకీయం చేసిన చరిత్ర రామన్నదే అన్నారు. రిమ్స్ లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను అమ్ముకున్నారని ఆరోపించారు. అమ్ముడు పోయారన్న వ్యాఖ్యలపై దీపాయిగూడలోని హనుమాన్ మందిరంలో ప్రమాణం చేయడానికి రావాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, జంగు పటేల్, భోజారెడ్డి, సుజాత్ అలీ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.




# ఓజిలో పాటపాడనున్న పవన్ కళ్యాణ్


పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు ఓ గుడ్ న్యూస్. ప్రజెంట్ పాలిటిక్స్ మీద ఆయన ఫుల్ కాన్సంట్రేట్ చేశారు. అందువల్ల, షూటింగులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆయన షూటింగ్ చేయడం లేదు గానీ... ఆయనతో సినిమాలు చేస్తున్న దర్శక నిర్మాతలు సినిమా మీద వర్క్ చేయడం ఆపలేదు. పవన్ నటిస్తున్న క్రేజీ సినిమాల్లో 'ఓజీ' ఒకటి. దీని గురించి సంగీత దర్శకుడు తమన్ ఓ అప్డేట్ ఇచ్చారు. వన్ కళ్యాణ్ స్టార్ హీరో. ఆయన హీరో మాత్రమే కాదు... ఆయనలో ఓ సింగర్ కూడా ఉన్నారు. ఆయనతో పాట పాడించాలని తమన్ ప్లాన్ చేస్తున్నారు. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ చేస్తున్న సినిమా 'ఓజీ'. ఆ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'ఓజీ' స్క్రిప్ట్ లో పవన్ గారి చేత పాడించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. మేం ఆ అవకాశాలను పరిశీలిస్తున్నాం' అని చెప్పారు. పవన్ కళ్యాణ్ గనుక ఓకే అంటే... 'ఓజీ'లో ఆయన పాటను మనం వినొచ్చు. ఈ సినిమా కోసం ఆల్రెడీ తమన్ కొన్ని ట్యూన్స్ ఇచ్చారు. అందులో ఓ పాటను పుణెలో షూటింగ్ కూడా చేశారు. 'ఓజీ'లో పవన్ సరసన యంగ్ హీరోయిన్ ప్రియాంకా అరుల్ మోహన్ నటిస్తున్నారు. వాళ్లిద్దరిపై ఆ పాట తీశారు.

ఇంతకు ముందు 'తమ్ముడు' సినిమాలో 'ఏం పిల్ల మాటాడవా' పాటతో మొదలు పెడితే... అందులోనే 'తాటి చెట్టు' నుంచి 'ఖుషి' సినిమాలో 'బై బయ్యే బంగారు రవణమ్మ...', 'జానీ' సినిమాలో 'నువ్వు సారా తాగకు', 'రావోయి మా ఇంటికి', 'పంజా'లో 'పాపారాయుడు', 'అత్తారింటికి దారేది'లో 'కాటమరాయుడు', 'అజ్ఞాతవాసి' సినిమాలో 'కొడకా కోటేశ్వర్ రావు' పాటలు పాడారు.



# దూసుకుపోతున్న గుంటూరు కారం

టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్‌బాబు కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం గుంటూరు కారం. ఈ సినిమాను తొలి రోజు నుంచి నెగెటివ్ టాక్, ట్రోల్స్ చుట్టుముడుతున్నా..కలెక్షన్ల విషయంలో మాత్రం తగ్గేదేలే అంటోంది. టాక్ మాటెలా ఉన్నా సూపర్ స్టార్ మ్యానరిజానికి అభిమానులు మరోసారి ఫిదా అయిపోతున్నారు. ఇప్పటికే థియేటర్లలో దగ్గర డ్యాన్సులు, కేకలతో హోరెత్తిస్తోన్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గుంటూరు కారం నెగెటివ్ టాక్‌తో సంబంధం లేకుండా అత్యంత అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది.




గుంటూరు కారం రూ.100 కోట్ల షేర్ రాబట్టింది. భరత్ అనే నేను, మహర్షి, సరిలేరు నీకెవ్వరు, సర్కారు వారి పాట సినిమాల తర్వాత ఈ రికార్డు సాధించిన చిత్రంగా గుంటూరు కారం నిలిచింది. దీంతో బ్యాక్ టు బ్యాక్ ఐదు సినిమాలకు రూ.100 కోట్ల షేర్ సాధించిన వన్ అండ్ ఓన్లీ టాలీవుడ్ హీరోగా రికార్డుల్లోకెక్కాడు ప్రిన్స్. గుంటూరు కారం శాటిలైట్ రైట్స్‌ను జెమినీ టీవీ దక్కించుకోగా.. పాపులర్ ఓటీటీ ఎ÷-లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను దక్కించుకుంది. గుంటూరు కారం మేకింగ్ వీడియో, మేకింగ్ స్టిల్స్ నెట్టింట హల్ చల్ చేస్తూ.. సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు. సెట్స్‌లో మీనాక్షి చౌదరి, శ్రీలీల, మహేశ్ బాబు, త్రివిక్రమ్ అండ్ ప్రొడ్యూసర్స్ టీం సరదా క్షణాలకు సంబంధించిన ఫొటోలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ మూవీలో ఎస్ థమన్ ఊరమాస్ కంపోజిషన్‌లో శ్రీలీల, మహేశ్ బాబు కాంబోలో వచ్చే హై ఓల్టేజ్ స్పైసీ హాట్ మాస్ కుర్చీని మడతపెట్టి సాంగ్ థియేటర్లు దద్దరిల్లిపోతున్నాయి.

# కలెక్షన్లలో నాసామిరంగా దూకుడు

కింగ్ నాగార్జున హీరోగా కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకత్వంలో తెరకెక్కి.. ఈ సంక్రాంతికి థియేటర్లలోకి వచ్చిన 'నా సామిరంగ' చిత్రం విడుదలైన మూడు రోజుల్లోనే కలెక్షన్లు పండిస్తోంది. బ్రేకీవెన్‌కి దగ్గరగా వచ్చేసినట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాని నిర్మించారు. నాగార్జునకు జోడిగా ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో అల్లరి నరేష్, రాజ్ తరుణ్, మిర్నా మీనన్, రుక్సర్ ధిల్లాన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా.. విడుదలైన అన్ని చోట్ల పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకుని.. విడుదలైన లిమిటెడ్ థియేటర్లలోనే భారీ కలెక్షన్స్ రాబడుతూ.. సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళుతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం బ్రేకీవెన్ కి దగ్గరగా వచ్చినట్లుగా తెలుపుతూ.. మూడు రోజులకు ఎంత కలెక్ట్ చేసిందో అధికారికంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్ ప్రకారం మూడో రోజు కూడా కిష్టయ్య కుమ్మేశాడు అనేలా కలెక్షన్స్ రాబట్టాడు. మొదటి రోజు 'నా సామిరంగ' సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 8.6 కోట్ల కలెక్షన్స్ రాబడితే.. రెండు రోజు రూ. 9.2 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను రాబట్టి మొత్తంగా రెండు రోజులకు కలిపి రూ. 17.8 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ని రాబట్టినట్లుగా మేకర్స్ అధికారికంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇక మూడో రోజు ఈ సినిమా రూ. 7.0 కోట్ల కలెక్షన్స్‌ను రాబట్టింది. మూడు రోజులకుగానూ ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ. 24.8 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ని రాబట్టినట్లుగా.. విడుదల చేసిన పోస్టర్‌లో మేకర్స్ తెలియజేశారు. 'నా సామిరంగ'కు లిమిటెడ్ థియేటర్లే లభించడంతో ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా తక్కువగానే జరిగింది. ఈ మూవీ రూ. 19 ప్లస్ కోట్ల షేర్ కలెక్షన్స్‌ని రాబడితే బ్రేకీవెన్ అయినట్లే. ప్రస్తుతం 3రోజులకి ఈ సినిమా రూ. 13 కోట్ల వరకు షేర్ రాబట్టినట్లుగా తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు పండగ ఈ సినిమాకు అడ్వాంటేజ్ అయింది. బుధవారం నుండి ఈ సినిమా రాబట్టే కలెక్షన్లే అత్యంత కీలకం కానున్నాయి. అయితే, పాజిటివ్ టాక్‌తో పాటు.. మరో వారం, పది రోజుల వరకు ఇతర సినిమాలేవీ లేవు కాబట్టి.. కచ్చితంగా 'నా సామిరంగ' బ్రేకీవెన్ అయ్యి, లాభాల బాట పట్టే అవకాశం ఉంది.




# క్లీంకార మీద అభిమానుల పాట

హీరో రామ్‌చరణ్-ఉపాసనల కుమార్తె క్లీంకారకు చిరంజీవి అభిమానులు తమ అభిమానాన్ని పాట రూపంలో తయారుచేసి పంపించారు. సంక్రాంతి సందర్భంగా ఆ పాటను తల్లి ఉపాసన విడుదల చేశారు. ప్రస్తుతం నెట్టింట్లో ట్రెండింగ్ అవుతున్న ఈ వీడియోను ఎక్కువమంది వీక్షిస్తున్నారు. 'కిలకిలా నవ్వింది క్లీంకార.. జగమంతా దీవించే మనసారా' అంటూ సాగే ఈ పాటను రఘు బెల్లంకొండ రాశారు. ధనుంజరు ఆలపించారు. 'చిన్నారి కోసం మేము అందించిన చిరు కానుక ఉపాసనకు నచ్చడం మా అదృష్టం' అని రఘు సంతోషాన్ని వ్యక్తంచేశారు. చిరంజీవి-అల్లు అరవింద్ కుటుంబ సభ్యులంతా బెంగుళూరులో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.



# ప్రభాస్ చిత్రానికి రాజాసాబ్ పేరు ఖరారు

ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి రూపొందిస్తున్న చిత్రానికి 'రాజా సాబ్' అనే పేరు నిర్ణయించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'రాజా సాబ్' చిత్రాన్ని దర్శకుడు మారుతి రూపొందిస్తుండడంతో సినిమా మీద అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వింటేజ్ లుక్‌లో లుంగీ కట్టుకున్న ప్రభాస్ అందర్నీ ఆకట్టుకుంటున్నారు. సరదాగా, రొమాంటిక్‌గా సాగే క్యారెక్టర్ లుక్‌లో 'డార్లింగ్' ప్రభాస్‌ను చూడడంతో అభిమానులతో పాటు సినిమా లవర్స్ అందరికీ ఫ్రెష్ ఫీల్ కలుగుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లోనే ఒక కలర్‌ఫుల్ సినిమా చూడబోతున్న భావనని మారుతి కలిగించారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో 'రాజా సాబ్' ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రానికి కార్తీక్ పళని సినిమాటోగ్రఫీని, తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. 'మగధీర', 'బాహుబలి' చిత్రాలకు వి.ఎఫ్.ఎక్స్ అందించిన కమల్ కన్నన్ ఈ సినిమాను వర్క్ చేస్తున్నారు.



Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com